బిక్కు బిక్కుమంటూ..

- శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాల భవనాలు
- భయం భయంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది
- రికార్డులు, సామగ్రి భద్రతకు అవస్థలు
- పట్టించుకోని అధికారులు



శిథిలావస్థకు చేరిన పశు వైద్యశాల



శిథిలావస్థకు చేరిన ఎంపీడీవో కార్యాలయ భవనం

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. భవనాల గోడలు బీటలు వారి తలుపులు, కిటికీలు ఊడిపోతున్నాయి. భవనాలపై కప్పు శ్లాబు, రేకులు పాడై పోవడం, పెచ్చు లూడిపడుతున్నాయి. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది భయపడుతూ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం పడితే నీరు కారుతుండడంతో కార్యాలయాల్లో రికార్డులు, సామగ్రి భద్రపరిచేందుకు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. రోజూ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొనే విధులు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలో ఎంపీడీవో, జీసీసీ, ఐసీడీఎస్, అటవీశాఖ, పశు సంవర్థక శాఖాల కార్యాలయాల భవనాలు 40 ఏళ్ల కిందట నిర్మించారు. ప్రస్తుతం భవనాల పరిస్థితి అత్యంత ఘోరంగా ఉంది. భవనాల శ్లాబ్‌ల పెచ్చులూడిపడుతున్నాయి. ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది భయం..భయంతో విధులు నిర్వహిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

పాడైన కిటికీలు, తలుపులు

ఎంపీడీవో, పశుసంవర్థకశాఖ, జీసీసీ కార్యాలయాల్లో గదులకు ఏర్పాటు చేసిన తలుపులు, కిటికీలకు చెదులుపట్టి చాలా వరకు పాడైపోయాయి. కొన్ని కిటికీల తలుపులు వేసే పరిస్థితి లేదు. కిటికీల తలుపులు వేసేందుకు ప్రయత్నిస్తే ఊడిపోతున్నాయని పలువురు చెబుతున్నారు. దీంతో అప్పుడప్పుడు విష సర్పాలు కార్యాలయాల్లోకి ప్రవేశిస్తున్నాయి.దీంతో సిబ్బంది భయపడాల్సిన పరిస్థితి నెలకొందని ఆందోళన చెందుతున్నారు. గతంలో పలు కార్యాలయాలకు మరమ్మతులు చేసి, రంగులు వేయించారు. అయినా సరే శిథిలావస్థకు చేరడంతో రేకుల పాడైపోవడం, శ్లాబ్ నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. వర్షం పడేటప్పుడూ పలు చోట్ల నీరు కారుతుండడంతో విధులకు సైతం ఆటంకం కలుగుతుంది. జిల్లా స్థాయి అధికారులు కార్యాలయాలకు వచ్చినప్పుడు భవనాల పరిస్థితి చూసి నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశాలు జారీ చేసి వెళ్లిపోతున్నారు. మండల స్థాయి అధికారులు పదే పదే ప్రతిపాదనలు పంపుతున్న నిధులు మంజూరు కావడం లేదని స్థానికులు చెబుతున్నారు. కార్యాలయాల బాగోకపోయినా సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతూనే విధులు నిర్వహిస్తున్నారంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొత్త భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



పెచ్చులూడిపడుతున్న ఐసీడీఎస్ కార్యాలయ భవనం



శిథిలావస్థలో ఉన్న ఫారెస్టు శాఖ భవనం



జీసీసీ కార్యాలయం దుస్థితి

ప్రతిపాదనలు పంపాం

మండల ప్రజా పరిషత్ కార్యాలయం శిథిలావస్థలో ఉంది. కిటికీలు, తలుపులు పాడైయ్యాయి.భవనం పైకప్పు రేకులు పాడై, శ్లాబ్ నుంచి పెచ్చులు పడుతున్నాయి.అప్పుడప్పుడు విష సర్పాలు గదులలోకి వస్తున్నాయి. రికార్డులు,సామాగ్రీ నిల్వకు ఇబ్బందిగా ఉంది.భవన పరస్థితిని ఉన్నత అధికారులకు తెలియజేశాం. ప్రతిపాదనలు పంపాం. నూతన భవనం నిర్మిస్తే మంచిది. – సూర్యనారాయణమూర్తి, ఎంపీడీవో, ముంచంగిపుట్టు

ఉన్నతాధికారుల దృష్టికి సమస్య

అటవీశాఖ కార్యాలయ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. కిటికీలు, తలుపులు పాడైయ్యాయి.అప్పుడప్పుడు విష సర్పాలు గదుల్లోకి వస్తున్నాయి.శాఖ పరమైన సమావేశాలు, రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం కోసం ఇబ్బందులు పడుతున్నాం. భవనాల పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేశాం.నూతన భవనాలకు నిధులు మంజూరు చేసి, నిర్మిస్తే భవనాల సమస్య తీరుతుంది. – పి.వెంకయ్య చౌదరి, ఫారెస్టు రేంజర్, ముంచంగిపుట్టు

పశువ్యాధులపై అప్రమత్తం

జి.మాడుగుల: మండలంలో జి.ఎం.కొత్తూరు గ్రామంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ సృజన కుమారి ఆధ్వర్యంలో గురువారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఈ వర్షాకాల సీజన్‌లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేయాలని రైతులకు సూచించారు. మండలంలోని గ్రామాల్లో ఈ నెల 26 నుంచి జూలై 10వ తేదీ వరకు నట్టల నివారణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పశువ్యాధులపై అప్రమత్తం ఉండాలన్నారు. జి.ఎం కొత్తూరు గ్రామంలో గల 113 గొర్రెలు, మేకలకు నట్టలనివారణ మందులు అందించారు. జెవీవో భాస్కరరావు, ఏహెచ్‌ఎఎస్‌లు కొండబాబు, రఘునాథ్, వెంకట్, శ్యామ్‌ప్రవీన్, ఓఎస్‌లు మత్స్యలింగం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని నెల్లిమెట్ల గ్రామంలో గురువారం మేకలు, గొర్రెలకు నట్టలనివారణ మందు అందజేసినట్టు పశువైద్యాధికారి డాక్టర్ తరుణ్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 26 నుంచి జూలై 10వ తేదీ వరకు మేకలు, పశువులకు నట్టల నివారణ తదితర మందు అందజేసినట్టు చెప్పారు.



నెల్లిమెట్లలో మేకలకు మందు వేస్తున్న సిబ్బంది



జి.ఎం.కొత్తూరులో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేస్తున్న సిబ్బంది

సాంకేతిక సమస్యతో నిలిచిన పథకం

కొయ్యూరు: యు డైస్‌లో సమస్యతో అంతాడ పంచాయతీ వై.ఎం.సింగధార జీపీఎస్ టీబ్ల్యూ పాఠశాలకు చెందిన సుమారు 20 మంది విద్యార్థులకు తల్లికి వందనం డబ్బులు జమకాలేదు. దీంతో పిల్లలను బడికి పంపిస్తున్న తల్లిదండ్రులు ఉపాధ్యాయుల తీరుపై అసంతృప్తి చెందుతున్నారు. గ్రామంలోని కొండపైన పాఠశాల ఉంది. అక్కడ సెల్ సిగ్నల్ ఉండదు. దీంతో ఆన్‌లైన్‌లో హాజరు వేయడం సాధ్యం కాలేదు. దీంతో యు డైస్ నిలిచిపోయింది.ఫలితంగా విద్యార్థుల వివరాలు నమోదు కాలేదు. ఈ కారణంగా తల్లికి వందనం సొమ్ములు చిన్నారుల తల్లుల ఖాతాకు జమకాలేదు. ఎట్టకేలకు ఉన్నతాధికారులు స్పందించి ఆయా చిన్నారులకు బంగారంపేట పంచాయతీ రాజుపేట ఎంపీ పాఠశాల పేరిట పది మంది విద్యార్థులకు మరి కొందరికి తాటిమానిపాలెం పాఠశాల యు డైస్‌లలో చేరుస్తున్నారు.దీని మూలంగా వారంతా తల్లికి వందనం పథకానికి అర్హత సాధించేలా చర్యలు చేపడుతున్నారు. ఈ విషయంపై ఎంఈవో ఎల్.రాంబాబు మాట్లాడుతూ సింగధార విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు. వారి పేర్లు రాజుపేట, తాటిమానిపాలెం గ్రామాల్లోని పాఠశాల యు డైస్‌లో చేర్చినట్టు తెలిపారు.



తల్లికి వందనం పథకానికి నోచుకోని వైఎం సింగధార విద్యార్థులు

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం



అరకులోయలో ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు



దుంబ్రిగుడలోని ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

అరకులోయటౌన్: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా అవగాహన ర్యాలీలు, సదస్సులు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాళ్లు, సీఐలు, ఎస్‌ఐలు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల జీవితాలు నాశనమవుతాయన్నారు. డ్రగ్స్, వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవుపలికారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, తీసుకోవలసిన జాగ్రతలను వివరించారు.మాదక ద్రవ్యాల రవాణా, క్రయ విక్రయాల్లో భాగస్వాములు అయితే చట్ట ప్రకారం శిక్షార్హులు కావడం వల్ల జీవితాలు పాడవుతాయన్నారు. యువత వనరులు ఉపయోగించుకుని బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలన్నారు.అరకులోయలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్ నాయక్, నషా ముక్త్ భారత్ అభియాన్ కో–ఆర్డినేటర్ ఎం.అనిత కుమారి, ఎన్ఎస్ఎస్ పీవోలు వై.విజయలక్ష్మీ, నాగబాబు , వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కొండబాబు, అధ్యాపకులు గణేష్, లచ్చన్న, సునీల్‌కుమార్, సోంబాబు, అప్పారావు, ఎస్ఐ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: మండలంలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.సుజాత, ఇన్‌చార్జి హెచ్‌ఎం సన్యాసమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలో జరిగిన కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ 234 బెటాలియన్ కమాండెంట్ మనోజ్ కుమార్ యాదవ్, బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ బి.కుసలప్ప తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: మండలంలో జరిగిన కార్యక్రమంలో రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవీ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఐటీడీఏ పీవో అపూర్వభరత్, ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా తదితరులు మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు బానిసలై బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని హితవుపలికారు.

ఏపీవో జగన్నాథరావు, సీఐ దుర్గాప్రసాద్, తహసీల్దార్ చిరంజీవి, ఎంపీడీవో రామకృష్ణ, ఎస్ఐ రమేష్, ప్రిన్సిపాల్ రత్నమాణిక్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండలంలో జరిగిన కార్యక్రమంలో న్యాయవాది కె.ఎస్.వి.రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎటపాక: మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ అప్పలరాజు, తహసీల్దార్ సుబ్బారావు, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

వి.ఆర్.పురం: మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్‌కుమార్, విద్యార్థులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కోరాబు అనూషదేవి, ఎంపీడీవో శ్రీనివాసరావు,"సర్పంచ్ దురియా పుష్పలత సీఐ వినోద్ బాబు, ఎస్ఐ వెంకటేశ్వరరావు, ఎంఈవో ప్రసాద్, బోడం నాయుడు, ఎక్సైజ్ సీఐ కూర్మారావు, ఏసీడీపీవో రామలక్ష్మి,హెచ్‌ఎం సాగిన రామరాజుపడాల్ తదితరులు పాల్గొన్నారు.



ఎటపాకలో మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం



చింతపల్లిలో ర్యాలీలో ఎంపీపీ అనూషదేవి, ఎంపీడీవో శ్రీనివాసరావు, సీఐ వినోద్‌బాబు



అరకులోయలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఐ గోపాలరావు,తదితరులు



చింతూరులోని ర్యాలీలో పీవో అపూర్వభరత్, ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా తదితరులు



జీకే వీధిలో మాట్లాడుతున్న కమాండెంట్ మనోజ్‌కుమార్ యాదవ్



రంపచోడవరంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం, రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష తదితరులు



అడ్డతీగలలో మాట్లాడుతున్న న్యాయవాది రమణ



వీఆర్ పురంలో ర్యాలీలో పాల్గొన్న పోలీసు సిబ్బంది, విద్యార్థులు

విత్తనాల పంపిణీ

రాజవొమ్మంగి/వై.రామవరం/గంగవరం/జీకే వీధి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరి, వేరుశనగ తదితర విత్తనాలను గురువారం రైతులకు పంపిణీ చేశారు. రాయితీపై అందజేస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో భాగంగా రాజవొమ్మంగిలో ఏవో చక్రధర్, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యులు పెద్దిరాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. వై.రామవరంలో జరిగిన కార్యక్రమంలో ఏవో ఎం.సుజాత, ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి, ఎంపీడీవో కె.బాపన్నదొర, ఈవోపీఆర్డీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. గంగవరంలో జరిగిన కార్యక్రమంలో ఏవో కె.విశ్వనాథ్, ఎంపీపీ కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ కె.గంగాదేవి, సర్పంచ్ కలుముల అక్కమ్మ, ఎంపీటీసీ ఆదినారాయణ, సర్పంచ్‌లు కామరాజుదొర, శివ, సిద్ధూ, మాజీ ఎంపీపీ డాక్టర్ ప్రభ తదితరులు పాల్గొన్నారు. గూడెం కొత్తవీధిలో జరిగిన కార్యక్రమంలో ఏవో మధుసూదన్, సర్పంచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు పరిష్కరించాలి

దుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయితీ కోసంగి గ్రామంలో రోడ్లు, వీధి దీపాలు మంజూరు చేయాలని కోరుతూ వైకాపా మండల కార్యదర్శి మట్టం శంకర్ పంచాయతీ కార్యదర్శి గౌతమికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోసంగిలో సీసీ రోడ్డు లేకపోవడంతో చిన్నపాటి వర్షం పడినా బురదమయమవుతుందని, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు ఎక్కడపడితే అక్కడ నిలువ ఉంటుందని వినతిలో పేర్కొన్నారు. రాత్రిపూట వీధి దీపాలు లేక ఇబ్బందులకు గురవుతున్నామని సమస్య పరిష్కరించాలని వారు కోరారు. దీనిపై సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పంచాయతీ కార్యదర్శి గౌతమి తెలియజేసినట్టు పేర్కొన్నారు.



పంచాయతీ కార్యదర్శి గౌతమికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి శంకర్ తదితరులు

సమస్యలపై అధికారులకు వినతులు



చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వి.ఆర్.పురం: రానున్న వరదలను దృష్టిలో ఉంచుకొని పునరావాస కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌ను టీడీపీ నాయకులు తదితరులు వినతిపత్రం అందజేశారు. వరద ముంపునకు గురయ్యే గ్రామాలను ముందస్తుగా గుర్తించి, నష్టాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని, ఆస్పత్రుల్లో మందుల కొరత లేకుండా చూడాలని కోరారు. జెడ్పీటీసీ రంగారెడ్డి, నాయకులు శ్రీనివాసరావు చిన్నరెడ్డి తదితరులున్నారు. జెడ్పీటీసీ రంగారెడ్డి, నాయకులు శ్రీనివాసరావు చిన్నరెడ్డి తదితరులున్నారు.

సర్వేయర్ల వినతి

అడ్డతీగల: అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ సచివాలయ సర్వేయర్లు డిప్యూటీ తహసీల్దార్ తేజస్వినికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఏళ్లు గడిచినా ప్రమోషన్, సీనియార్టీ వంటివి అమలు చేయలేదని వినతిలో పేర్కొన్నారు. గ్రామ సర్వేయర్ల సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో చేపట్టిన రిలే దీక్షలకు మద్దతు తెలుపుతున్నామన్నారు.



అడ్డతీగలలో డిప్యూటీ తహసీల్దార్ తేజస్వినికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామ సర్వేయర్లు

క్లుప్తంగా

సక్రమంగా రేషన్ పంపిణీ



సాదేక్ గ్రామంలో వృద్ధులకు రేషన్ పంపిణీ చేస్తున్న తహసీల్దార్ రాజ్‌కుమార్

జి.మాడుగుల: సక్రమంగా రేషన్ పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ జి.రాజ్‌కుమార్ చెప్పారు. మండలంలో సాదేక్ గ్రామంలో ఆయన గురువారం పర్యటించి, దివ్యాంగులు, వృద్ధుల ఇంటికి వెళ్లి రేషన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు, 65 సంవత్సరాలు దాటిన వృద్ధుల ఇళ్లకే వెళ్లి డిపో డీలర్లు రేషన్ పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది, డీలర్ పాల్గొన్నారు.

వర్షాలకు నేలకొరిగిన విద్యుత్ స్తంభం



పడిపోయిన స్తంభం

గూడెంకొత్తవీధి: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పెదవలస పంచాయతీ చినజడుమూరులో గురువారం విద్యుత్ స్తంభం నేలకొరిగింది.ఈ సమాచారాన్ని స్థానికులు వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు తెలిపారు. దీంతో సిబ్బంది వచ్చి వెంటనే చర్యలు చేపట్టారు. లేకుంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు.

సర్పంచ్‌ల శిక్షణ తరగతులు ప్రారంభం



మహిళా సర్పంచ్‌లతో అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, ఎంపీడీవో లవరాజు

అరకులోయటౌన్: అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని అరకులోయ, అనంతగిరి, దుంబ్రిగుడ మండలాల్లోని మహిళా సర్పంచ్‌ల శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులకు అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పాల్గొని ప్రారంభించారు. మార్పు ద్వారా విజేతలు– సాధికారితతో స్వపరిపాలన సాధ్యం అనే అంశంపై మహిళ సర్పంచ్‌లకు శిక్షణ ఇస్తున్నట్టు ఎంపీడీవో అడపలవరాజు తెలిపారు. అరకులోయ జెడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిణి, ట్రైనర్లు, మూడు మండలాల మహిళ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆధార్ నమోదు



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: మండల పరిషత్ కార్యాలయంలో మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు గురువారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0–6 సంవత్సరాల పిల్లలకు ఆధార్ లేకుంటే వెంటనే బాల ఆధార్ చేయించాలని ఆదేశించారు. జనన ధ్రువీకరణ పత్రాలు లేకుంటే వాటిని సచివాలయాల ద్వారా అందజేయాలని సూచించారు. మహిళా పోలీసులు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించాలని సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలన్నారు. ఈవోపీఆర్డీ పాపారావు తదితరులు పాల్గొన్నారు

స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

ముంచంగిపుట్టు: మండలంలోని పనసపుట్టు పంచాయతీ పోతురాజుపుట్టు ఎంపీపీఎస్ పాఠశాలలో సర్పంచ్ భాగ్యవతి విద్యార్థులకు సమకూర్చిన స్టడీ మెటీరియల్స్‌ను హెచ్‌ఎం లకేదాసు, భాగ్యవతి సేవా సంఘం సభ్యులు, ఉపాధ్యాయులు గురువారం పంపిణీ చేశారు. ఈ సంఘం ఆధ్వర్యంలో పలు పాఠశాలల్లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, పుస్తకాలు, పలకలు అందించినట్టు సభ్యులు తెలిపారు. సంఘం సభ్యులు సింహాద్రి, రాజు, బలరాం, రఘురాం, త్రినాథ్, జగబంధులు తదితరులు పాల్గొన్నారు.